


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
02-02-2026
పేజీలు: 02



## ప్రశ్నించే గొంతు నొక్కేందుకు భౌతిక దాడులు చేస్తున్నారు

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బ తీయాలన్న దురుద్దేశంతోనే సీఎం చంద్రబాబు తిరుమల లడ్డూ వివాదాన్ని సృష్టించారని వైయస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆక్షేపించారు. సీబీఐ సిట్ ఛార్జ్‌షీట్‌తో చంద్రబాబు కుట్ర బట్టబయలైందని, ఈ కేసులో ఆయన అడ్డంగా దొరికిపోయారని పేర్ని నాని వెల్లడించారు. ప్రశ్నించే గొంతు నొక్కేందుకు భౌతిక దాడులు చేసున్నారని, అంబటి రాంబాబుపై దాడి ప్రభుత్వ కుట్ర అని స్పష్టం చేశారు. అంబటి రాంబాబుపై హత్యాయత్నం అత్యంత హేయమని కృష్ణా జిల్లా పామర్రులో మీడియాతో మాట్లాడిన పేర్ని నాని ధ్వజమెత్తారు.

# సిట్ చీఫ్ సజ్జనార్‌పై హరీశ్‌రావు సీరియస్

సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నెసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ — 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో



నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. దర్యాప్తు న్యాయబద్ధంగా ఉండటమే కాకుండా న్యాయంగా కనిపించాలని సుప్రీంకోర్టు పదే పదే చెబుతుందని గుర్తుచేశారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు.




## చిట్యాల వైన్ షాపులో చోరీ..

20 వేల క్యాష్, రెండు బీర్లు ఎత్తుకెళ్లిన దుండగులు నల్గొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఖుషీ వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. షట్టర్‌ను గునపంతో పగులగొట్టిన దుండగులు కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదు, ఒక సెల్‌ఫోన్, రెండు బీర్ బాటిళ్లు ఎత్తుకెళ్లారు. ఉదయం వైన్స్‌కు వచ్చిన తర్వాత షాపు తాళం పగులకొట్టి ఉండటంతో షాప్ నిర్వాహకులకు విషయం తెలిసింది.

## సిట్ చీఫ్ సజ్జనార్‌కు కేటీఆర్ సిరియస్



'చట్టవిరుద్ధమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశ్నించడం ముగిసింది' అని ఆదివారం రాత్రి సిట్ చీఫ్ సజ్జనార్ ప్రకటించడం వివాదాస్పదం అయ్యింది. సజ్జనార్ తీరును ఇప్పటికే మాజీ మంత్రి హరీష్‌రావు తప్పుపట్టారు. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా సజ్జనార్ ప్రకటనపై అభ్యంతరం వ్యక్తంచేశారు. 'కమిషనర్‌గారూ (సజ్జనార్‌ను ఉద్దేశించి) మీరే న్యాయమూర్తిగా, జ్యూరీగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లుగా కనబడుతున్నారు. దయచేసి మీరు దర్యాప్తు బృందానికి చైర్మన్‌గా ఉన్నారనే విషయాన్ని గుర్తుచేసుకోండి. ఫోన్ ట్యాపింగ్ కేసు చట్టవిరుద్ధమా, చట్టబద్ధమా..? అనేది చట్టపరంగా కోర్టు ద్వారా నిరూపణ కావాల్సి ఉంది' అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. 'ఇలాంటి తీవ్ర అభ్యంతరకరమైన ప్రకటనలను గౌరవ కోర్టులు పరిగణలోకి తీసుకుంటాయని, అందుకు తగిన చర్యలు తీసుకుంటాయని నేను ఆశిస్తున్నా' అంటూ ముగించారు. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు కేసీఆర్‌ను ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసంలో ఐదు గంటలపాటు విచారించారు. విచారణ ముగిసిన అనంతరం ప్రకటన చేస్తూ సజ్జనార్.. 'ఇల్లీగల్ ఫోన్ ట్యాపింగ్ కేసు' అని వ్యాఖ్యానించారు.

## జోగి రమేశ్ పై కేసు నమోదు..
## అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన మాజీ మంత్రి



మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మంత్రి నారా లోకేశ్ పై జోగి రమేశ్ అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జోగి రమేశ్ పై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. నారా లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలతో పాటు కులాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడారనే ఆరోపణలతో... 189(2), 190, 292, 324(4) BNS (143, 149, 290, 427 IPC) సెక్షన్ల కింద పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఇబ్రహీంపట్నం ఎస్ఐ సత్యవతి కేసు నమోదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో, తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని భావించిన జోగి రమేశ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన ఫోను కూడా అందుబాటులో లేనట్టు తెలుస్తోంది. నిన్న రాత్రి జోగి రమేశ్ తిరుపతి నుంచి ఇబ్రహీంపట్నంలోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయనను పరామర్శించేందుకు మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు వచ్చారు. అనంతరం రాత్రి 1.30 గంటల సమయంలో జగ్ మోహన్ రావుతో కలిసి ఆయన తన నివాసం నుంచి వెళ్లిపోయారు.


# లోక్‌సభలో రాహుల్ గాంధీ వర్సెస్ రాజ్‌నాథ్ సింగ్



మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవాణే తన పుస్తకంలో రాసుకున్న వ్యాఖ్యలను ఇవాళ రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీంతో లోక్‌సభలో రగడ నెలకొన్నది. ప్రచురణ కాని పుస్తకం నుంచి రాహుల్ వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కేంద్ర బడ్జెట్‌పై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. అయితే చైనా అంశంపై మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే తన పుస్తకంలో రాసుకున్న వ్యాఖ్యలను రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఓ మ్యాగజైన్‌లో ప్రచురించిన పేజీలను ఆయన సభలో చూపించారు. తన వాదనను నిజం చేసే రీతిలో ఆ ప్రస్తావన ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికార పక్షం వ్యతిరేకించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంశాఖ మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని.. ఇంతకీ రాహుల్ చెప్పన్న ఆ బుక్ పబ్లిష్ అయ్యిందా లేదా అని ప్రశ్నించారు. హౌజ్ రూల్స్‌ను రాహుల్ గాంధీ ఉల్లంఘించినట్లు రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రచరణ జరగని పుస్తకాన్ని ఉద్దేశిస్తూ ఎలా వ్యాఖ్యానిస్తారని ఆయన ప్రశ్నించారు. ఆ పుస్తకంలో ఎంత వాస్తవం ఉందో ఎలా తెలుస్తుందని ఆయన అన్నారు. ఆ సమయంలో రాహుల్, రాజ్‌నాథ్ మధ్య వాగ్వాదం జరిగింది. చాలా విశ్వసనీయ సమాచారాన్ని తాను ప్రస్తావిస్తున్నట్లు రాహుల్ తెలిపారు. అయితే ఏ పుస్తకం నుంచి ఆ వ్యాఖ్యలను తీసుకున్నారో.. ఆ పుస్తకాన్ని సభలో ప్రవేశపెట్టాలని రాజ్‌నాథ్ డిమాండ చేశారు. ప్రతిపక్ష పక్ష నేత రాహుల్ ఆ బుక్‌ను సభలో ప్రవేశపెట్టాలని ఆయన అన్నారు.

## ఇరాన్‌లో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు

ఇరాన్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.3గా భూకంప తీవ్రత నమోదైంది. భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కొన్నిచోట్ల భవనాలకు పగుళ్లు రావడం మినహా ఎటువంటి ఆస్తి నష్టం జరగలేదని మెహర్, బిద్ధన్ అఖండ్ ప్రాంతాలలోని భవనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయని అక్కడి అధికారులు పేర్కొన్నారు. భూకంపం రావడంతో ప్రజలు పెద్దఎత్తున బాహ్య ప్రదేశాలకు పరుగులు తీశారని తెలిపారు. అంతే కాకుండా ఖతార్‌లోనూ యూఏఈలోనూ స్వల్పంగా భూ ప్రకంపనలు వచ్చినట్లు ఆ దేశాలు ప్రకటించాయి. అయితే దానివల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదని పేర్కొన్నాయి. అయితే భూకంప తీవ్రత ఎలా ఉందనే అంశం అధికారులు పరిశీలిస్తున్నారు.



# సెగలు పుట్టిస్తోన్న దివ్య



అందాల నదివే.. నన్నందులోన ముంచేసావులే.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు కుర్రాళ్లు. రోజూ క్రేజీ ఫోటోషూట్లతో నెట్టింట రచ్చ చేసే దివ్య భారతి.. తాజాగా రెడ్ డ్రెస్ లో షేర్ చేసిన ఫోటోస్ కుర్రాళ్లకు కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ నెట్టింట రచ్చ చేస్తుంది. సినిమాలు అంతగా లేకపోయినా ఫోటోషూట్లతో సందడి చేస్తుంది ఈ వయ్యారి.తొలి చిత్రంతోనే నెట్టింట విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత తమిళంలో వరుస సినిమాల్లో నటించి స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు సుడిగాలి సుధీర్ సరసన తెలుగులో ఓ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. చాలా రోజులుగా వీరిద్దరి కాంబోలో రాబోయే ప్రాజెక్ట్ షూటింగ్ జరుగుతుండగా.. విడుదలైన ఫోటోస్ ఆకట్టుకున్నాయి.ఇదిలా ఉంటే.. ఓవైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా రెడ్ డ్రెస్ లో గ్లామర్ ఫోజులతో మతిపోగొట్టేస్తుంది ఈ వయ్యారి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి.


నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# రోహిత్ శెట్టికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ వార్నింగ్

బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి ఇంటి వద్ద ఆదివారం తెల్లవారుజామున కాల్పులకు తెగబడిన ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ఐదుగురు నిందితులను అమన్ ఆనంద్ మరోట్, స్వప్నిల్ బంధు సాకేత్, సిద్ధార్థ్ దీపక్ ఐన్‌పురే, సమర్థ్ శివ్ శరణ్ పోమాజీ, ఆదిత్య జ్ఞానేశ్వర్‌గా గుర్తించారు. ఆదివారం రాత్రి వారిని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారికి ఫిబ్రవరి 5 వరకు పోలీస్ కస్టడీ విధించింది. నిందితులు రోహిత్ శెట్టిని భయపెట్టాలన్న ప్లాన్‌తో జుహులోని ఆయన ఇంటిపై కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. రోహిత్ శెట్టి ఇంటిపై కాల్పులకు కుట్ర చేసింది మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అని తేలింది. బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన శుభం లంగ్‌కోర్, అర్జు బిష్ణోయ్, హరి బాక్సర్‌లు ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు ఫేస్‌బుక్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'రోహిత్ శెట్టిని చాలా సార్లు హెచ్చరించాం. మా పనికి అడ్డం రావద్దని చెప్పాం. అతడు మా మాటల్ని లెక్కచేయలేదు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమే. ఇప్పటికి కూడా అతడు అర్థం చేసుకోకపోతే.. ఈసారి బుల్లెట్లు ఇంటి



గోడల మీద కాదు.. బెడ్రూంలో అతడి గుండెలపై పేలుస్తాం' అని అన్నారు. కాగా, శుభం లంగ్‌కోర్.. బాబా సిద్ధిఖీ మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. శుభం చెప్పినందువల్లే సమర్థ్ శివ్ శరణ్ పోమాజీ.. రోహిత్ శెట్టి ఇంటిపై కాల్పులు జరపడానికి పూనుకున్నాడు. మిగిలిన నిందితులతో కలిసి పక్కా ప్లాన్ వేశాడు. ప్రధాన షూటర్ అమన్ ఆనంద్ మరోట్ మరో నిందితుడితో కలిసి స్కూటర్‌పై రోహిత్ శెట్టి ఇంటి దగ్గరకు వచ్చాడు. ఇంటి గోడపై నాలుగు రౌండ్లు కాల్పలు జరిపాడు. ఆ వెంటనే ఇద్దరూ అక్కడినుంచి పరారయ్యారు. అయితే ఈ



కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. సాయంత్రానికే ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# పదో తరగతి అర్హతతో తపాలా శాఖలో 28,740 ఉద్యోగాలు




దేశ వ్యాప్తంగా ఉన్న పోస్టల్ సర్కిళ్లలో భారీగా గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఇండియా పోస్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 28,740 గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాలను భర్తీ చేయనుంది. పదో తరగతి పాసైన అభ్యర్థులు ఎవరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి రాత పరీక్షలేకుండానే కేవలం పదో తరగతి మార్కుల ఆధారంగా తుది నియామకాలు చేపడతారు. బ్రాంచ్‌పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్ పోస్టులను తమ సొంత ఊరిలోని తపాలా శాఖలోనే పొందవచ్చు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో ఫిబ్రవరి 14, 2026వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలు ఈ కింద చెక్ చేసుకోండి.. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అయితే పదో తరగతి సబ్జెక్టుల్లో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా ఉండాలి. ఏపీ, తెలంగాణకు చెందినవారైతే తప్పనిసరిగా తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకు చదివి ఉండాలి. దీనితోపాటు కంప్యూటర్ స్కిల్స్ ఉండాలి. అలాగే సైకిల్ లేదా బైక్ నడపడం వచ్చి ఉండాలి. అభ్యర్థుల వయసు 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో ఫిబ్రవరి 14 రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ.100 తప్పనిసరిగా చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌ఉమెన్‌లకు ఎలాంటి ఫీజు లేదు. ఫీజు చెల్లింపులు ఫిబ్రవరి 16వ తేదీ వరకు అవకాశం ఉంటుంది. ఇక నింపిన దరఖాస్తుల్లో ఏవైనా పొరబాట్లు ఉంటే సవరణలకు ఫిబ్రవరి 18, 19 తేదీల్లో అవకాశం ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు బీపీఎం పోస్టులకు రూ.12,000 నుంచి రూ.29,380, ఏబీపీఎం/ డాక్ సేవక్ పోస్టులకు రూ.10,000 నుంచి రూ.24,470 వరకు జీతంగా చెల్లిస్తారు. అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా మాత్రమే తుది ఎంపిక ఉంటుంది.




# రైలు కింద పడి తల్లీపిల్లల ఆత్మహత్య.. ఒంటరితనమే కారణమా?

హైదరాబాద్ చర్లపల్లి రైల్వేట్రాక్‌పై తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. తల్లి ఇలాంటి ఘోర నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం ఒంటరితనమే కావచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. విజయరెడ్డి తన ఇద్దరు పిల్లలు చేతన రెడ్డి, విశాల్ రెడ్డిని కారులో చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లారు. పార్కింగ్‌లో కారు పెట్టి 'తనకు జీవించాలని లేదని, తాను లేకపోతే పిల్లలు ఒంటరవుతారని' సూసైడ్ నోట్ రాసి కారులో వదిలేశారు. అదే



లేఖను ఫొటో తీసి తన వాట్సప్ స్టేటస్‌గా కూడా పెట్టినట్టు పోలీసులు గుర్తించారు. కాగా ఆదివారం సాయంత్రం బీబీనగర్‌లో వీరి అంత్యక్రియలు జరిగాయి.

# 'మ్యాడ్ 3'కు రంగం సిద్ధం




టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది.

# హీట్ ఎక్కుతున్న ఏపీ రాజకీయం




సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో వైసీపీ నేత అంబటి రాంబాబుకు 14 రోజుల రిమాండ్ పడింది. అంబటిని రాజమండ్రి జైలుకు తరలించారు పోలీసులు . వరుస ఘటనలతో ఏపీ రాజకీయం అంతకంతకూ హీటెక్కుతోంది. తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు ఘాటుగా ట్వీట్ చేశారు.రాజకీయాలను నేరాల వైపు నడిపిన సంస్కృతి వైసీపీదేనన్నారు. వైసీపీ పాలనంతా చట్ట రహితంగానే కొనసాగిందన్నారు. అలాంటి పరిస్థితులకు 2024లో ముగింపు పలికామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మళ్లీ రూల్ ఆఫ్ లా అమలు అవుతోందన్నారు సీఎం చంద్రబాబు. ప్రజల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు.దాంతో ఆ పార్టీ నిరాశతో అసహనంతో వుందన్నారు. ఏపీ పునర్ నిర్మాణాన్ని చూసి వైసీపీ తట్టుకోలేకపోతుందని ట్వీట్‌లో విమర్శించారు సీఎం చంద్రబాబు.శాంతి భద్రతలను కాపాడే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవర్నీ ఉపేక్షించబోమన్నారు. అధికారంలో వున్నా ,ప్రతిపక్షంలో వున్నా సరే నిబంధనలు అందరికీ ఒకటేనన్నారు.హద్దులు దాటి ప్రవర్తిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు సీఎం చంద్రబాబు.

# తప్పు చేసిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా శిక్షిస్తాం : చంద్రబాబు

ఏపీలో అలజడి సృష్టించి శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు వైసీపీ ప్రజలను రెచ్చ గొట్టే చర్యలకు దిగుతుందని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. టీడీపీ శ్రేణులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండి సంయమనం పాటించాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై సోమవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల టీడీపీ నాయకులతో మాట్లాడారు. రాష్ట్రంలో తప్పులు చేసిన వారిని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీ నాయకులు కల్తీ జరుగలేదని ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, మంత్రులు, నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రేబిస్ ఇంజెక్షన్ వికటించి చిన్నారి మృతి

ప్రభుత్వ ఆసుపత్రిలో రేబిస్ ఇంజెక్షన్ వికటించి చిన్నారి మృతి. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు . కామారెడ్డి జిల్లా కొటాల్‌పల్లి గ్రామం నుండి బతుకుదెరువు కోసం తమ ఇద్దరు పిల్లలతో కామారెడ్డి పట్టణంలో స్థిరపడ్డ రమేష్—అర్చన అనే దంపతులు. గత నెల 25వ తేదీన ఇంటి బయట ఆడుకుంటున్న తమ కూతురు క్రితార్స(రెండున్నర ఏళ్ళు)ను వీధి కుక్క కరవడంతో కామారెడ్డిలో బోధనాసుపత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు. ఇటీవల మూడవ డోస్ వ్యాక్సిన్ తీసుకుని ఇంటికి వెళ్లాక చిన్నారి అస్వస్థతకు గురవ్వడంతో, సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు. ప్రైవేటు ఆసుపత్రిలో చిన్నారికి పల్స్ పడిపోయిందని చెప్పడంతో తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు నిర్ధారించిన వైద్యులు . దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కూతురు మరణించిందని, ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు . చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు విధుల్లో ఉన్న వైద్యుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు.

# అందాలు ఆరబోస్తున్న మాళవిక మోహనన్

ఏడు పదుల వయసులో కూడా ఇంకా కుర్రాడిలా కనిపించాలని తపన పడుతున్నారు మన సీనియర్ హీరోలు. అక్కినేని నాగార్జున, కాస్త రూటు మార్చి క్యారెక్టర్ వేషాలు వేస్తుంటే, నందమూరి బాలకృష్ణ.. సీనియర్ హీరోల్లో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఫ్యామిలీ ఆడియెన్స్ పల్స్ పట్టుకున్న విక్టరీ వెంకటేష్, 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో బ్లాక్ బస్టర్ కొట్టాడు. అయితే సీనియర్ హీరోల్లో కమ్‌బ్యాక్ కోసం కష్టపడుతున్న హీరో మెగాస్టార్ చిరంజీవి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి నటించిన 'భోళా శంకర్' ఎపిక్ డిజాస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత చిరూ మొదలెట్టిన 'విశ్వంభర' మూవీ, వాయిదాల మీద వాయిదాలు పడుతూ 2026 ఏడాదికి వెళ్లింది....వెంకీ స్టైల్‌లో తాను కూడా ఫ్యామిలీ ఆడియెన్స్‌ని మెప్పించే కథతో కమ్‌బ్యాక్ ఇవ్వాలని ఆశిస్తున్న చిరంజీవి, అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ చేస్తున్నాడు. ఇందులో నయనతార హీరోయిన్. 70 ఏళ్ల వయసులో కుర్రాడిలా స్టెప్పులు వేస్తూ కనిపించిన చిరూపై సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోలింగ్ వచ్చింది. ఈ మూవీ తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ సినిమా, 'వాల్తేరు వీరయ్య' డైరెక్టర్ కె.ఎస్. బాబీతో మరో సినిమా చేయాల్సి ఉంది.